సాక్షి చిత్తూరు
గురువారం। 14। మార్చి। 2024



జగనన్నతోనే వీరప్పల్లి అభివృద్ధి
వైఎస్సార్‌సీపీతోనే మాజీ మంత్రి అమరనాథ రెడ్డి స్వగ్రామం వీరప్పల్లి అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు.
- 8లో



ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి
సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని డీఆర్వో పుల్లయ్య సూచించారు.
- 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురువారం (సా)	సహర్ శుక్రవారం (ఉ)
చిత్తూరు	6.28	5.00
పుంగనూరు	6.30	5.04

న్యూస్‌రీల్

18 నుంచి ఒంటిపూట బడులు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలలు ఈనెల 18 నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈనెల 18వ తేదీ నుంచి ఏప్రిల్ 23 వ తేదీ వరకు ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఒంటిపూటబడులు నిర్వహించాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాల పాఠశాలలు తప్పనిసరిగా ఉత్తర్వులు అమలు చేయాలన్నారు.

కాణిపాకం హుండీ ఆదాయం రూ.1.13 కోట్లు



లెక్కింపును పరిశీలిస్తున్న చైర్మన్, ఈఓ

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామికి హుండీ కానుకల ద్వారా రూ.1.13కోట్ల ఆదాయం వచ్చినట్లు దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. గత 19 రోజుల హుండీ కానుకలను బుధవారం స్వామివారి ఆస్థాన మండపంలో లెక్కించారు. ఇందులో బంగారం 100 గ్రాములు, వెండి 670 గ్రాములు, గో సంరక్షణ హుండీ ద్వారా రూ.10వేలు, నిత్య అన్నదానం హుండీ ద్వారా రూ.32 వేలు, ప్రధార రథం హుండీ ద్వారా రూ.5వేలు, ఫారిన్ కరెన్సీ యూఎస్‌ఏ 70 డాలర్లు, కెనడా 210 డాలర్లు, సింగపూర్ 2 డాలర్లు, ఇంగ్లాండ్ 20 పౌండ్స్, న్యూజిలాండ్ 60 డాలర్లుతో కలిపి మొత్తం రూ.1.13కోట్లు ఆదాయం వచ్చినట్లు వారు వివరించారు.

ఇద్దరు ఉద్యోగులు సస్పెన్షన్

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేశారు. వివరాలను బుధవారం ఆలయ ఈఓ వెంకటేశు వెల్లడించారు. రెండు రోజుల కిందట రూ.150 క్యూలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి విజయవాడకు చెందిన ఏడుగురు భక్తుల వద్ద రూ.1000, రూ.100 క్యూలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు తిరువణ్ణామలై భక్తుల నుంచి దర్శనం పేరుతో రూ.800 అక్రమంగా వసూలు చేశారు. దీనిపై భక్తులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. వాస్తవమని తెలియడంతో వారిని సస్పెండ్ చేసి విచారిస్తున్నట్లు ఈఓ తెలిపారు.

మహా శివరాత్రి ఆదాయం రూ.12.36 లక్షలు

పుత్తూరు: మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా సదాశివకోనలోని శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయానికి రూ.12.36 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఎంఏ జయచంద్రన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా ఆదేశాల మేరకు మహాశివరాత్రి సందర్భంగా తొలిసారిగా భక్తులకు స్వామి వారి సర్వ దర్శనం కల్పించినట్లు తెలిపారు. హుండీ కానుకల ద్వారా రూ.10.16 లక్షల ఆదాయం రాగా, అందులో చిరిగిన, చెల్లని నోట్లు రూ.1.50 లక్షలు పోగా రూ.8.66 లక్షలు, తలనీలాల ద్వారా రూ.1.73 లక్షలు, సేవా టికెట్ల ద్వారా రూ.1.97 లక్షలతో కలిపి మొత్తం రూ.12.36 లక్షల ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. సమావేశంలో ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి, ఫెస్టివల్ స్పెషల్ ఆఫీసర్ సుబ్రమణ్యంనాయుడు, బోర్డు డైరెక్టర్లు గోపిరమణ, వాసుదేవరెడ్డి, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ లేని ఆస్పత్రులు సీజ్



స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న రవిరాజు

నగరి : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి ఆస్పత్రి, ల్యాబ్‌కు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ ఉండాలని ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రవిరాజు తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లు, స్కాన్ సెంటర్లను ఆయన తనిఖీచేసి రిజిస్ట్రేషన్లను పరిశీలించారు. ప్రభుత్వ ఆస్పత్రిలోని స్కానింగ్ సెంటర్‌ను పరిశీలించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ తనిఖీలు చేసిన ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లలో 90 శాతానికి పైగా రిజిస్ట్రేషన్లు లేవన్నారు. తొలి హెచ్చరికగా పది రోజులు గడువు ఇచ్చామన్నారు. గడువులోపు రిజిస్ట్రేషన్ చేసుకుని సర్టిఫికెట్లు పొందకుంటే సీజ్ చేస్తామన్నారు. అర్హత లేకుండా ఎంబీబీఎస్ బోర్డులు, మెడికల్ షాపులు పెట్టి వైద్యం చేసే వారిని గుర్తించేందుకే ఈ ప్రక్రియను ప్రభుత్వం కొనసాగిస్తోందన్నారు. స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టీడీపీ–జనసేన సోషల్ మీడియా అసభ్య పోస్టింగ్‌ల ట్రోల్స్‌కు తెనాలికి చెందిన గీతాంజలి ఆత్మహత్యకు పాల్పడడంపై జిల్లా వ్యాప్తంగా మహిళాలోకం భగ్గుమంది. ఆమె ఆత్మహత్య మహిళలను కలిచివేసింది. 'పేదింటి మహిళ ప్రభుత్వం నుంచి అందిన ఫలాలు గొప్పగా భావించింది. దాని పంచుకోవడం తప్పా..? దానికే టీడీపీ– జనసేన పచ్చ మూకలు ఇష్టానుసారంగా పోస్టింగ్‌లు పెడతారా? ఇదేనా మీరు మహిళలకు ఇచ్చే గౌరవం. అధికారం కోసం ఏమైనా చేస్తారా? గీతాంజలి మరణానికి పచ్చపార్టీలు సమాధానం చెప్పాలి. ఆ నీచుల భరతం పట్టాలి' అని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. అధికారంలోకి రాకముందే నీచ రాజకీయాలు చేస్తే.. ఒక వేళ అధికారంలోకి వస్తే తమకు గిట్టనివారిని చంపేస్తారా అని మండిపడ్డారు. మహిళలు మనోభావాలు వారి మాటల్లోనే

– చిత్తూరు రూరల్

పచ్చమూకల రాక్షసకాండపై మహిళా లోకం భగ్గు



- ప్రభుత్వ లబ్ధిని తెలియజేయడమే పాపమా?
- టీడీపీ–జనసేన సోషల్ మీడియా అసభ్య ట్రోల్స్‌తోనే గీతాంజలి ఆత్మహత్య
- మహిళపై కించపరిచేలా పోస్టింగ్‌లా?
- రోడ్డున పడ్డ ఇద్దరు పిల్లలు
- పచ్చమూకలను కఠినంగా శిక్షించాలని సర్వత్రా డిమాండ్

కఠినంగా శిక్షించాలి



సంతోషం, బాధ మనిషి భావోద్వేగాలు వాటిని ఇతరులు హననం చేయడం నేరం. గీతాంజలికి సొంతింటి కల అయిన ఇంటి స్థలం రావడం పట్ల ఆనందంగా అభిప్రాయం చెప్పడం తప్పా. సోషల్‌మీడియాలో ట్రోల్ పేరిట పైశాచికత్వం చూపడం సరికాదు. నిందితులను కఠినంగా శిక్షించాలి.

– షకీలా, అధ్యక్షురాలు, ప్రజాస్వామ్య మహిళా సంఘం

కిరాతక చర్య



గీతాంజలి నీచంగా వేధించడం కిరాతక చర్య. తాను సొంతింటికి యజమాని అయ్యానంటూ గీతాంజలి సంబరపడడం నేరమా? టీడీపీ, జనసేన సోషల్ మీడియా మానసిక క్షోభకు గురిచేసి ఆత్మహత్యకు పాల్పడేలా చేయడం క్షమించరాని నేరం.

– మీనా, చవరంబాకం(నింద్ర)

కలచి వేస్తోంది



పచ్చ పైశాచికానికి గీతాంజలి బలి కావడం యావత్తు సమాజాన్ని కలచి వేస్తోంది. ఇది ముమ్మాటికీ టీడీపీ. జనసేన బ్యాచ్ రాక్షసత్వమే. దోషులను ఉరితీయాలి.

–మీనా, నల్లవెంగనపల్లె, వెదురుకుప్పం మండలం

ముమ్మాటికీ ఇది హత్యే



టీడీపీ, జనసేన సోషల్ మీడియాలో చిత్రికరించిన అనుచిత పోస్టింగులతోనే గీతాంజలి ఆత్మహత్య చేసుకుంది. ఇది ఆరెండు పార్టీల హత్యే. ఆమె సంక్షేమ లబ్ధిని తెలిపితే కుట్రగా భావించి విచక్షణ రహితంగా సోషల్ మీడియాలో చిత్రికరించడం దారుణం. ఇది ముమ్మాటికీ టీడీపీ, జనసేన రాక్షసత్వమే. నిందితులను కఠింగా శిక్షిస్తేనే ఆమె ఆత్మ శాంతిస్తుంది.

వరలక్ష్మి, గుడుపల్లె

• కొవ్వొత్తులతో నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు, మహిళలు

చిత్తూరు కార్పొరేషన్: పచ్చమూకల ట్రోల్స్‌కు బలైన తెనాలికి చెందిన గీతాంజలికి వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మంగళవారం రాత్రి గాంధీవిగ్రహం ఎదుట కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో మేయర్ అముద, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళ అధ్యక్షురాలు లీనారెడ్డి, నగర అధ్యక్షుడు జ్ఞానజగదీష్, టిమ్ము, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సరళామేరి, పెద్ద సంఖ్యలో మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

• పచ్చ సైకోల పనే



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు

చిత్తూరు రూరల్: గీతాంజలి మృతికి కారణమైన పచ్చమూకల సోషల్ మీడియా బాధ్యులను అరెస్టు చేయాలని విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు దయానంద ఆచారి ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. దోషులను కఠినంగా శిక్షిస్తేనే ఆమె ఆత్మకు శాంతి చేకూరుతుందని తెలిపారు.

ఇది చాలా దుర్మార్గం



గీతాంజలి పొందిన ప్రభుత్వ పథకాల లబ్ధిని మీడియా తెలియజేయడమే పాపమా? మహిళ సభ్యసమాజం తలదించుకునేలా టీడీపీ, జనసేన ట్రోల్స్ ఉన్నాయి. సోషల్ మీడియాను వేదికగా చేసుకుని గీతాంజలిపై అసభ్యకరంగా పోస్టింగ్‌లు పెట్టి ఉసురు తీసుకున్నారు. తీవ్రంగా ఖండిస్తున్నాం.

–ప్రతిమారెడ్డి, చిత్తూరు

ఇంకెంతమందిని చంపేస్తారు



ప్రభుత్వం మహిళలకు ప్రాధాన్యం ఇస్తోంది. వారి పేరుతోనే పథకాలు అందిస్తోంది. జరిగిన మేలును గొప్పగా చెప్పుకోవడం..మనిషి నైజం. దాని తట్టుకోలేని పచ్చ సోషల్ మీడియా గీతాంజలి ప్రాణాన్ని తీసింది. అధికారానికి రాకముందే ఇలా ఉంటే. వస్తే..ఇంకెంతమంది ప్రాణాలను బలితీసుకుంటారో...బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

–వనిత, చిత్తూరు రూరల్

రాజకీయ స్వలాభం కోసమే



జనసేన–టీడీపీ రాజకీయ స్వలాభం కోసం గీతాంజలిని బలితీసుకున్నాయి. వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం ప్రజలను భయపెట్టాలని చూస్తున్నారు. ఇలా చేసుకుంటూ పోతే మరో రక్త చరిత్ర అవుతుంది. ఇది నీచరాజకీయం. ఇలాంటి రాజకీయాలు చేసేవారికి భవిష్యత్ ఉండదు. గీతాంజలి ఇద్దరు పిల్లలకు సమాధానం చెప్పాలి.

– రత్న, పలమనేరు

ఆ నీచుల భరతం పట్టాలి



ఆ పేదింటి మహిళలకు ప్రభుత్వం నుంచి అందిన ఫలాలు గొప్పగా భావించింది. దాని పంచుకోవడం తప్పా..? దానికే ఇష్టానుసారంగా పోస్టింగ్‌లు పెడుతారా? ఇదేనా మీరు మహిళలకు ఇచ్చే గౌరవం. గీతాంజలి మరణానికి పచ్చపార్టీలు సమాధానం చెప్పాలి. మరో మహిళలకు ఇలా జరగకుండా నీచుల భరతం పట్టాలి.

– కలైఅరసి, మాజీ జెడ్పీటీసీ, గుడిపాల

మృతికి కారణం టీడీపీయే



మహిళలను కించపరచే ధోరణిలో టీడీపీ వ్యవహరిస్తోంది. అధికారం కోసం పాకులాడుతోంది. మహిళలను అడ్డు పెట్టుకుని నీచ రాజకీయాలకు ఒడిగడుతోంది. టీడీపీ సోషల్ మీడియా విష ప్రచారంతోనే గీతాంజలి మృతి చెందింది. పచ్చ మూకలకు శిక్ష పడాలి. ఆమె మృతికి టీడీపీయే బాధ్యత వహించాలి.

– అరుణ, జీడీనెల్లూరు

ప్రజాశీస్సులే ప్రచారాస్త్రాలు



ఇంటి పట్టాలు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి రోజా

- సంక్షేమాన్ని కొనసాగించేందుకు జగనన్న సిద్ధం
- ఊహకు అందని హామీలతో బాబు కుయుక్తులు
- ఇళ్ల పట్టాల పంపిణీలో పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు: ప్రజల ఆశీస్సులే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రచార అస్త్రాలని రాష్ట్ర పర్యాటక, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. ఊహకు అందని హామీలను గుప్పిస్తున్న టీడీపీ, జనసేన పార్టీల అభూత కల్పనలకు, జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలకు మధ్య ఎన్నికల యుద్ధం జరగనుందని తెలిపారు. ప్రజా దీవెనలతో అంతిమ విజయం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదేనని స్పష్టం చేశారు. బుధవారం వడమాలపేట మండలం ఎస్బీఆర్‌పురం పంచాయతీ చెంచువారి కాలనీ, ఏబీఆర్ కాలనీకి చెందిన 162 మందికి ఇంటి పట్టాలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సంకల్ప యాత్రలో ప్రజల కష్టాలను తెలుసుకున్న జగనన్న వాటికి పరిష్కార మార్గాలుగా అధికారంలోకి రాగానే నవరత్నాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రతి సామాజిక వర్గానికి మేలు జరిగేలా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో ప్రజల వద్దకే పాలనను తీసుకొచ్చారని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అబద్ధాల బాబు బ్యాచ్‌ను జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధితో ప్రతి కార్యకర్త నిలువరించాలని పిలుపునిచ్చారు. పేదల పక్షాన జగనన్న, పెత్తందారుల పక్షాన చంద్రబాబు అండ్‌కో మధ్య జరుగుతున్న ఎన్నికల యుద్ధంగా అభివర్ణించారు. చంద్రబాబు అండ్ కో మోసపు హామీలను నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరని పేర్కొన్నారు. మంచిపై చెడు గెలిచిన చరిత్రే లేదని, మంచి చేస్తున్న సీఎం జగనన్నను గెలిపించేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని మంత్రి రోజా అన్నారు. వీవర్స్ అసోసియేషన్ రాయలసీమ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి, వడమాలపేట తహసీల్దార్ రాజసింహ నరేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబు, రాజేష్, తిమ్మయ్య, కృష్ణయ్య, ఉమాపతి, నందయ్య, మదన్‌మోహన్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు సురేష్‌రాజు, మునిశేఖర్, రామిరెడ్డి, శాప్ డైరెక్టర్ యాదవేంద్రరెడ్డి, వైస్ ఎంపీపీలు లోకేష్, ఉపేంద్ర, సోషల్‌మీడియా కన్వీనర్ చంద్రారెడ్డి, డీఎల్‌ఎస్‌సీ మెంబర్ కిరణ్‌కుమార్, సింగిల్ విండో ప్రెసిడెంట్ సుధీర్‌రెడ్డి, సర్పంచులు, ధర్మయ్య, శేషాద్రిరెడ్డి, రవిరెడ్డి, మునెమ్మ, అంజమ్మ, కమల, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

స్టోర్స్‌కు విద్యుత్ పరికరాలు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో ఉమ్మడి జిల్లా స్టోర్స్‌కు విద్యుత్ పరికరాలు వచ్చాయని ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయ న మాట్లాడుతూ వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు (25 కేవీ సామర్థ్యం) 180, సోలార్ సీటీ మీటర్స్ 500, సీటీ మీటర్స్ 200, ఐఆర్‌డీఏ స్కానర్స్ 42 వచ్చాయని పేర్కొన్నారు. సంబంధిత ఏఈలు వర్క్ ఆర్డర్లు పెట్టి మెటీరియల్ తీసుకోవచ్చని తెలిపారు. సకాలంలో పరికరాలను వినియోగదారులకు ఇవ్వాలని ఆయన సూచించారు.

లో ఓల్టేజీల నివారణకు కొత్త సబ్‌స్టేషన్లు



సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి



ఇళ్ల పట్టాలను అందజేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల: మండలంలోని జాండ్లవారిపల్లె, చెంచెంరెడ్డిగారిపల్లెలో రూ.5.25 కోట్లతో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్లను రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోవోల్టేజీని నివారించేందుకు సబ్ స్టేషన్లను నిర్మించినట్లు తెలిపారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తామని అన్నారు. తాము తీసుకుంటున్న చర్యలతో మరో 30 సంవత్సరాలపాటు విద్యుత్ సమస్యలు రావన్నారు. అలాగే బండకిందపల్లె యూపీ పాఠశాలలో రూ.47 లక్షలతో నిర్మించిన తరగతులను మంత్రి ప్రారంభించారు. జాండ్లవారిపల్లెలో 600 మందికి రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. రొంపిచెర్లకు చెందిన బాల సుబ్రమణ్యంకు రూ.1.25 లక్షలు, తన్వీర్ అలీకి రూ.85 వేలు, గాజులపల్లెకు చెందిన మునిరాజమ్మకు రూ.40 వేలు సీఎం సహాయ నిధి చెక్కులను మంత్రి అందజేశారు. ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి, సీఎండీ సంతోష్‌రావు, సీఈ వెంకట చలపతి, ఎస్ఈ కృష్ణారెడ్డి, ఎంపీడీవో రెడ్డెప్పచ్చారి, తహశీల్దార్ షేక్ మోహీద్దీన్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కుప్పానికి బాబు చేసిందేమీ లేదు

- సీఎం జగనన్న హయాంలోనే అభివృద్ధి
- చేయూత సభలో ఎమ్మెల్సీ భరత్



మహిళలకు మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం: కుప్పం నియోజకవర్గానికి 35 ఏళ్లుగా ఎమ్మెల్యేగా, 14 ఏళ్లు ముఖ్యమంత్రి పదవిలో కొనసాగిన చంద్రబాబు ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన వైఎస్సాఆర్ చేయూత చెక్కుల పంపిణీ సభకు ఆయన ముఖ్య అతిథి విచ్చేసి ప్రసంగించారు. బాబు హయాంలో ఎన్ని పేద కుటుంబాలకు సాయం చేసి, వారిని అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండు చేశారు. రోడ్లు, వీధి దీపాలు అంటూ సర్పంచ్ స్థాయిలో జరిగే పనులను ఆయన సీఎం హోదాలో చేశారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో తాను కుప్పం ప్రాంతంలో పలు రోడ్లు వేయించానని, సచివాలయాలు, ఆర్బీకే, రూరల్ హెల్త్ సెంటర్ భవనాలు నిర్మించడంతో పాటు నాడు–నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చానని చెప్పారు. ప్రతి కుటుంబం అభివృద్ధి చెందితేనే సమాజాభివృద్ధి సాధ్యమనే సత్యాన్ని సీఎం జగనన్న రుజువు చేసి చూపారన్నారు. అభివృద్ధి అంటే ఇదని ఎమ్మెల్సీ భరత్ తెలిపారు

ఐదేళ్లు ఎక్కడున్నారు ?

దాదాపు ఐదేళ్ల పాటు అడ్రెస్ లేకుండా ఉన్న టీడీపీ నాయకులు ఇప్పుడు గ్రామాల్లోకి వచ్చి రాజకీయాలు చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితి లేదని భరత్ అన్నారు. కరోనా లాంటి విపత్తు సమయంలో సీఎం, తనతో సహా వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రజలకు సేవలు అందించామని గుర్తు చేశారు. కుప్పంలో ఇల్లు మాత్రమే కాక ఓటు కూడా లేని చంద్రబాబు మాయ మాటలు, బెదిరింపులతోనే ఇంత కాలం ఇక్కడ రాజకీయం చేశారన్నారు. ఎవరికి కష్టం వచ్చినా ఎమ్మెల్యేతో చెప్పుకునే అవకాశం కూడా కుప్పం ప్రజలకు లేదని చెప్పారు. అనంతరం చేయూత లబ్ధిదారులకు రూ.7.60 కోట్ల చెక్కును అందజేశారు. లబ్ధిదారులతో కలిసి సీఎం చిత్రపటానికి ఎమ్మెల్సీ పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, పార్టీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, ఎంపీడీవో మైథిలి, ఏపీవో గ్రీటా, వైస్ ఎంపీపీ పట్టాభి, కార్పొరేషన్ల డైరెక్టర్లు చెంగప్ప, కృష్ణమూర్తి, నాగభూషణమ్మ, నాయకులు రమేష్, నిసార్, ఏవీ జయరాం తదితరులు పాల్గొన్నారు.

పల్లెలకు త్రీఫేజ్ కరెంట్

- ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు
- జీడీనెల్లూరు నియోజకవర్గంలో రూ.210 కోట్లతో విద్యుత్ లైన్ల ఆధునీకరణ
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి


ఏడీఈ భవనాన్ని ప్రారంభిస్తున్న సీఎండీ సంతోష్‌రావు, పక్కన డిప్యూటీ సీఎం నారాయణస్వామి, కృపాలక్ష్మి

కార్వేటినగరం: ప్రతి గ్రామానికి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అందుబాటులోకి తీసుకొస్తామని ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రూ.75 లక్షలతో నూతనంగా నిర్మించిన ఏడీఈ భవనాన్ని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ మినీ పరిశ్రమలు నెలకొల్పేందుకు అనుగుణంగా గ్రామాల్లోని ప్రతి ఇంటికీ అవసరమైన త్రీఫేజ్ విద్యుత్‌ను అందించేందుకు పనులు జరుగుతున్నాయని, త్వరలో అందుబాటులో వస్తుందన్నారు. నారాయణస్వామి మాట్లాడుతూ జీడీనెల్లూరు నియోజకవర్గానికి రూ.210 కోట్ల వ్యయంతో గ్రామాల్లో త్రీఫేజ్ విద్యుత్ అందించేందుకు చొరవ చూపిన విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి రుణపడి ఉంటానని అన్నారు. గతంలో విద్యుత్ సర్వీసుల కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి మూడు నెలల వరకు గడువు ఉండేదని, ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకుపోవడంతో 22 రోజుల్లోనే సర్వీసులు అందేలా చూడాలని మంత్రి ఆదేశించిట్లు గుర్తు చేశారు. అదే విధంగా గంగాధరనెల్లూరు ఎస్సీ నియోజకవర్గం కావడంతో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో వీధి దీపాలకు కావాల్సిన స్తంభాలను అందించాలని కోరారు. వైఎస్సార్ సీపీ జీడీనెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి, ఎంపీపీ లత, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, సర్పంచ్ ధనంజయవర్మ, విద్యుత్‌శాఖ సీజీఎం ధరజ్ఞాని, ఎస్ఈ కృష్ణారెడ్డి, ఏస్ఏవో శ్రీనివాసులు, డీఈ సివిల్ తిరుమల రావు, ఏడీఈలు, ఏఈలు, ఏవో ఆనందమ్మ పాల్గొన్నారు.

ఎన్ని పార్టీలతో వచ్చినా బాబుకు ఓటమి తప్పదు

కార్వేటినగరం: జరగనున్న ఎన్నికల్లో కౌరవ సైన్యంతో వైఎస్సార్ సీపీ తలపడనుందని, ఆయుద్ధానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి తెలిపారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సమాజాన్ని నాశనం చేసే దుష్ట శక్తులకు దాయాదని, రావణాసురుడు, భస్మాసురుడికి సోదరుడని మంత్రి విమర్శలు గుప్పించారు. చంద్రబాబు ఎంతమందితో పొత్తులు కుదుర్చుకున్నా జగనన్న వైపు జనప్రభంజనం ఉన్నంత వరకూ ఏమి చేయలేరని పేర్కొన్నారు. ఎన్ని మోస పూరిత హామీలిచ్చినా బాబు కూటమికి ఓటమి తప్పదని విమర్శించారు.

క్లుప్తంగా

వినాయకుని దర్శించుకున్న విదేశీ భక్తులు


ఆలయంలో విదేశీ భక్తులు

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని వివిధ దేశాలకు చెందిన భక్తులు బుధవారం మధ్యాహ్నం దర్శించుకున్నారు. అమెరికా, కెనడా, యూకే, నెదర్లాండ్, జర్మనీ, రష్యా దేశాలకు చెందిన 46 మంది భక్తులు స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి, ప్రత్యేక దర్శనం కల్పించారు. ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం ఇప్పించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు.

దుస్తుల ప్యాక్‌పై ఎమ్మార్పీ ఉండాలి

చౌడేపల్లె: దుస్తుల ప్యాక్‌లపై ఎమ్మార్పీ లేకుండా విక్రయాలు చేస్తే చర్యలు తప్పవని తూనికలు కొలతలు శాఖా అధికారిణి రమాదేవి హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని వస్త్ర దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. బస్టాండ్‌లోని మమత టెక్స్‌టైల్స్‌లో వస్త్రాల బాక్స్‌లపై ఎంఆర్పీ ధరలు లేకపోవడాన్ని గుర్తించారు. ఇష్టాను సారంగా విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. అలాగే పలు దుకాణలను తనిఖీ చేసి కొలతల స్కేల్‌పై తూనికలు, కొలతలశాఖకు చెందిన ముద్ర తప్పనిసరిగా ఉండాలని తెలిపారు.

జగనన్నతోనే వీరప్పల్లి అభివృద్ధి


లబ్ధిదారులకు మెగా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- మాజీ మంత్రి అమర్ పంచాయతీలో రూ.76.08 లక్షల అభివృద్ధి
- ఎమ్మెల్యే వెంకటేగౌడ

పెద్దపంజాణి: వైఎస్సార్‌సీపీతోనే మాజీ మంత్రి అమరనాథరెడ్డి స్వగ్రామమైన వీరప్పల్లి పంచాయతీ అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. బుధవారం మండలంలోని వీరప్పల్లి, చలమంగళం, పెద్దవెలగటూరు గ్రామాల్లో రూ.1.20 కోట్లతో నిర్మించిన సచివాలయాలు, వీరప్పల్లి, లింగాపురంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలు, రాయలపేట గ్రామంలో రూ.20.08 లక్షలతో నిర్మించిన విలేజీ హెల్త్ క్లీనిక్, వీరప్పల్లిలో రూ:10 లక్షలతో వేసిన సీసీరోడ్డు, కాలువలు, కూరగాయల కొత్తప్పల్లి గ్రామంలో రూ.5 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వీరప్పల్లిలో పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. వీరప్పల్లి పంచాయతీకి డీబీటీ ద్వారా రూ.12.63 కోట్లు, నాన్ డీబీటీ కింద రూద.4.19 కోట్లు అందించామన్నారు. మాజీ మంత్రి సొంత పంచాయతీలోనే రూ.16 కోట్లు ఖర్చు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని తెలిపారు. అమరనాథరెడ్డి మంత్రిగా పనిచేసినా ఇక్కడి ప్రజలకు చేసింది శూన్యమని విమర్శించారు. ప్రాంతాలు, పార్టీలకతీతంగా తమ ప్రభుత్వంలో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు చెప్పారు. దమ్ముంటే దీనిపై చర్చకు రావాలని సవాలు విసిరారు.

ఆడ పడుచులకు జగనన్న అండ

ఆడపడుచులకు ఆర్థికభరోసా కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నట్లు ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయ ఆవరణలో 'వైఎస్సార్ చేయూత' చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని పథకాల్లోనూ మహిళలకే ప్రాధాన్యత కల్పిస్తూ వారి అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. ఎంపీపీ రెడ్డెప్ప, జెడ్పీటీసీ సభ్యురాలు సుష్మకీర్తి, సింగిల్ విండో చైర్మెన్ ఓబుల్ రెడ్డి, వైస్ ఎంపీపీలు జీడీ బాబు, ఆంజమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగా రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు హరినాథ్, పార్టీ జిల్లా కార్యదర్శులు తమ్మిరెడ్డి, సుహేబ్, ఏపీఎం కృష్ణప్ప, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



సచివాలయ వార్డు సెక్రటరీపై దాడి

పలమనేరు: పట్టణంలోని టీఎస్ అగ్రహారం సచివాలయ వార్డు వెల్ఫేర్ సెక్రటరీ జి.ఆనంద్‌పై అదే వార్డు పరిధిలోని వలంటీర్ సురేష్‌కుమార్ స్నేహితులతో కలసి దాడి చేసిన ఘటన ఈనెల పదిన జరగ్గా, బుధవారం వెలుగు చూసింది. ఇప్పటికే బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం ఏపీఎన్జీవోల నేత ఆనంద్, లక్ష్మీపతి తదితరులు సీఐ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డిని కలిసి నిందితులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రాన్ని అందించారు.

ఆరుగురు విద్యార్థులు డిబార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో బుధవారం నిర్వహించిన ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో ఆరుగురు డిబార్ అయినట్లు డీవీఈఓ సయ్యద్ మౌలా వెల్లడించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని ఎన్ఆర్‌పేట పరీక్ష కేంద్రంలో నలుగురు, బొమ్మసముద్రం కేంద్రంలో ఇద్దరు డిబార్ అయ్యారన్నారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు 14,349 మంది విద్యార్థులకు గానూ, 13,523 మంది హాజరైనట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు.

నేడు వైఎస్సార్ ఈబీసీ నేస్తం పంపిణీ

– మూడవ విడతలో 23,215 మందికి రూ.34.82 కోట్ల విడుదల


శ్రీదేవి, ఈడీ, బీసీ కార్పొరేషన్

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ ఈబీసీ నేస్తం మూడవ విడత పంపిణీ కార్యక్రమం గురువారం జరుగనుందని బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ నంద్యాల జిల్లా బనగానపల్లెలో పథకం రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని సీఎం ప్రారంభిస్తారన్నారు. కలెక్టరేట్‌లో గురువారం ఉదయం జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు చేశామన్నారు. ఏటా రాష్ట్ర ప్రభుత్వం ఈబీసీ నేస్తం లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా రూ.15 వేలను డీబీటీ రూపంలో జమ చేస్తోందన్నారు. ఇప్పటి వరకు రెండు విడతలలో పథకం అమలు చేశారన్నారు. రెండు విడతలలో జిల్లాలోని 46,719 మంది లబ్ధిదారులకు రూ.70.10 కోట్లను ప్రభుత్వం జమ చేసిందని తెలిపారు. గురువారం నిర్వహిం చనున్న మూడవ విడత పంపిణీలో జిల్లాలోని 23,215 మంది లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.34.82 కోట్లను ప్రభుత్వం జమ చేయ నుందని తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి గిరింపేట యువత


పార్టీలో చేరినవారితో విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ నాయకుడు దినేష్ ఆధ్వర్యంలో బుధవారం పలువురు యువకులు పార్టీలో చేరారు. చిత్తూరు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి నివాసంలో రెడ్డిగుంట, గిరింపేట ప్రాంతాలకు చెందిన 15 మంది యువకులు పార్టీలో చేరగా, కండువా వేసి వారిని విజయానందరెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో మోహన్, సూర్య, ప్రదీప్, భాను, తరుణ్ వారి మిత్ర బృందం ఉన్నారు.

జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌కు 24మంది ఎంపిక


జాతీయస్థాయి ప్రదర్శనకు ఎంపికైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రముఖులు

గంగవరం: జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనక్‌కు 23 మంది ఎంపిక అయ్యారు. మండలంలోని మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజుల రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనక్ (2022–23) సైన్స్ ప్రదర్శన బుధవారం ముగిసింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ప్రదర్శనలకు హాజరైన గైడ్ ఉపాధ్యాయులు, యంగ్ సైంటిస్ట్‌ల ప్రదర్శనలతో సైన్స్ పండుగ వాతావరణం నెలకొంది. జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజులు, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి పరిశీలనలో ప్రదర్శనలు సజావుగా సాగాయి. బాల శాస్త్రవేత్తలు తయారు చేసిన మానవాళికి ఉపయోగపడే శాస్త్ర విజ్ఞానం అనువర్తనలు, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచే క్లిష్టతర అంశాలను సులభతరం చేసే పలురకాల శాస్త్రీయ పరికరాలు ఆలోచింపజేశాయి. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ నుంచి వచ్చిన ముగ్గురు పరిశీలకుల బృందం అత్యుత్తమంగా 24మంది విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలను జాతీయస్థాయికి ఎంపిక చేసింది. ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి ప్రొఫెసర్లు భాగ్యశ్రీ, స్టేట్ నోడల్ ఆఫీసర్ శారదాదేవి, ప్రొఫెసర్ గారీమేరీ, డీవైఈవో చంద్రశేఖర్, సైన్స్ అధికారి రమణ, ఎన్ఐఎఫ్ అబ్జర్వర్లు పలు సందేహాలను నివృత్తి చేశారు. జాతీయ స్థాయికి ఎంపికైన ప్రయోగాలను ఏప్రిల్ లేదా మే నెలలో న్యూఢిల్లీలో ప్రదర్శించాల్సి ఉంటుందని ఎస్సీఈఆర్టీ సభ్యులు తెలిపారు. పలమనేరు సూపర్‌బజార్ అధ్యక్షుడు ఆర్‌వీ సుభాష్‌చంద్రబోస్, పత్తికొండ శ్రీనాథ్ హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

గంజాయి విక్రేత అరెస్టు


నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో గంజాయి విక్రేత జి.రవికుమార్ (31) అనే ఆటో రవిని పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ ఉలసయ్య వివరాలను వెల్లడించారు.. తిరుపతి–బెంగళూరు బైపాస్ రోడ్డులో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటువైపు వస్తున్న ఆటో డ్రైవర్ దారి మళ్లించి వేగంగా వెళ్లేందుకు ప్రయత్నించాడు. పోలీసులు పట్టుకుని ఆటో తనిఖీ చేయగా రెండు కిలోల గంజాయి లభించింది. ఇటీవల టూటౌన్ పోలీసులు పట్టుకున్న ఓ గంజాయి కేసులో సైతం రవికుమార్ నిందితుడిగా ఉన్నాడు. పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న ఇతని వద్ద తాజాగా రెండు కిలోల గంజాయి లభించడంతో అరెస్టు చేశారు. ఆటోను సైతం సీజ్ చేశారు. ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని డీఆర్‌ఓ పుల్లయ్య అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలకు జరిగేలా సహకరించాలన్నారు. ఈవీఎంల వినియోగం పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సరిహద్దు పోలింగ్ కేంద్రాలలో వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులోకి వచ్చిన వెంటనే బ్యానర్లు, కటౌట్లు తొలగించాలన్నారు. పోలింగ్ ఏజెంట్ల నియామకంలో ఎన్నికల సంఘం నియమాలను తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. ఎన్నికలకు సంబంధించిన సమాచారం సీఈఓ ఆంధ్ర వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందన్నారు. రాజకీయ పార్టీలు సూచించిన పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటానని డీఆర్వో తెలిపారు. పలు పార్టీల ప్రతినిధులు ఉదయ్‌కుమార్, భాస్కర్, అట్లూరి శ్రీనివాసులు, గంగరాజు, సురేంద్రకుమార్, పరదేశి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిపై పచ్చనేతల పాగా

- రెవెన్యూ అధికారులకు గ్రామస్తుల ఫిర్యాదు
- సర్పంచ్‌పై ఆక్రమణదారుల దౌర్జన్యం



ఆక్రమణకు గురైన ప్రభుత్వం భూమి

గుడుపల్లె : రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని ఇటీవల కాంగ్రెస్‌లో ఉండి ప్రస్తుతం టీడీపీలో చేరిన నాయకులు కబ్జా చేశారు. ఏకంగా ట్రాక్టర్లతో దున్నేశారు. రెండు నెలల్లో రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం వస్తుందని నమ్మకంతో ఖాళీగా ఉన్న మొత్తం భూమిని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు సర్వే చేస్తుండగా సర్పంచ్‌పై ఆక్రమణదారులు దాడికి దిగారు. వివరాలు ఇలా.. మండలంలోని గుడుపల్లె రైల్వే స్టేషన్ క్రాస్‌లోని ఒంటిపల్లె రెవెన్యూకు సంబంధించిన సర్వే నంబరు 35లో మొత్తం 5 ఎకరాల 34 సెంట్లు ఉంది. ఇందులో ప్రభుత్వం ప్రాథమిక ఆస్పత్రిని సుమారు 1–30 ఎకరాల్లో నిర్మించారు. మిగిలి భూమిలో కొంతమందికి ఇళ్ల పట్టాలు, మసీదుకు కలసి అర్ధ ఎకరా భూమి ఉంటుంది. మిగిలి ఉన్న భూమి గుట్ట అక్కడక్కడ చదునుగా ఉంది. కుప్పం మెయిన్ రోడ్, రైల్వే స్టేషన్ మధ్యన భూమి ఉండడతో అడుగు సుమారు రూ.2 వేల నుంచి 3 వేలు పలుకుతోంది. మండలంలోని రైల్వే స్టేషన్ క్రాస్‌కు చెందిన నాగేష్, అతని కుమారుడు అమరేష్ ఈభూమిని ఆక్రమించారు. దీంతో కుప్పిగానిపల్లె పంచాయతీకి చెందిన కొంత మంది తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. బుధవారం రెవెన్యూ అధికారులు. సర్వేయర్లు, స్థానిక సర్పంచ్ రామమూర్తి భూమి వద్దకు చేరుకుని సర్వే ప్రారంభించారు. సమాచారం తెలుసుకుని ఆగ్రహం వ్యక్తం చేస్తూ నాగేష్,అమరేష్ ముక్కుమ్మడిగా సర్పంచ్‌పై దౌర్జన్యానికి దిగారు. గొడవ పెద్దది కావడంతో పోలీసులకు సమాచారం అందించారు. ప్రభుత్వం భూమిని సర్వే చేస్తుండగా తనపై దుర్భాషలాడి దౌర్జన్యం చేసినట్లు సర్పంచ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

లారీ ఢీకొని సైక్లిస్టు మృతి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ సైక్లిస్టు మృతి చెందాడు. గిరింపేట నుంచి చిత్తూరు వైపు వస్తున్న ఓ లారీ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న సైక్లిస్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో సైకిల్‌పై వెళుతున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహం గుర్తుపట్టలేనంతగా ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధ్యతగా ఎన్నికల విధులు నిర్వహించాలి



శిక్షణలో పాల్గొన్న పీఓ, ఏపీఓలు, మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల విధులను ప్రిసైడింగ్ ఆఫీసర్‌లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్‌లు బాధ్యతగా నిర్వర్తించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్, జెడ్పీ సమావేశ మందిరంలో విడతల వారీగా పీఓ, ఏపీఓలకు శిక్షణ ఇచ్చారు. జాయింట్ కలెక్టర్ విధి విధానాలపై ఎన్నికల సంఘం జారీచేసిన హ్యాండ్‌బుక్‌ను పూర్తిగా చదివి అర్థం చేసుకోవాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వ్యవహారాలను నియంత్రించే చట్టపరమైన అధికారం పీఓలకు ఉంటుందన్నారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత పీఓలపై ఉందని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో పోలింగ్ రోజున మాక్‌పోలింగ్ ఉంటుందన్నారు. ఈవీఎం, వీవీప్యాట్‌ల వినియోగంపై శిక్షణ ఇచ్చి ఎన్నికల హ్యాండ్‌బుక్‌ను పంపిణీ చేశారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, ఆర్డీవో చిన్నయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివయ్య, సోషల్ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మీ, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రబ్బానిబాషా, ఏపీడీలు గంగాభవాణి, ఉమాదేవి, , పీఓ, ఏపీఓలు పాల్గొన్నారు.

మహిళా లోకానికి ఆదర్శం కవయిత్రి మొల్ల


నివాళులు అర్పిస్తున్న డీఆర్‌ఓ పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్ : తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్ల రచనా శైలి గొప్పదని, సంస్కృత రామాయణాన్ని సరళమైన తెలుగు భాషలోకి అనువదించిన ఆమె జీవితం మహిళాలోకానికి ఆదర్శనీయమని డీఆర్‌ఓ పుల్లయ్య అన్నా రు. బుధవారం కలెక్టరేట్‌లో కవయిత్రి మొల్ల జయంతిని నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న డీఆర్‌ఓ తొలుత మొల్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బాని బాషా, కలెక్టరేట్ ఏఓ వెంకటేశ్వరన్, తదితరులు పాల్గొన్నారు.